క్లుప్తంగా

నేడు, రేపు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

గన్నవరం: మండలంలోని కేసరపల్లి పంచాయతీ పరిధిలో ఈ నెల 30, 31వ తేదీల్లో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక ఆదివారం తెలిపారు. కేసరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం, ఈ నెల 31న వెంకటనరసింహాపురం కాలనీలోని ఎంపీయూపీ పాఠశాలలో సురక్ష క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నున్న గ్రామంలో..

నున్న(విజయవాడరూరల్): నున్న సచివాలయం-3 నందు సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు గ్రామ కార్యదర్శి జీటీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ పరిధిలో వైద్యపరీక్షలు చేయించుకుని స్లిప్పులున్న ప్రతి ఒక్కరూ వైద్య శిబిరంలో పాల్గొనే డాక్టర్లతో వైద్య సేవలను ఉచితంగా పొందవచ్చని పేర్కొన్నారు.

వరకట్నం వేధింపులపై కేసు నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు కథనం మేరకు తాడిగడపకు చెందిన షేక్ ఖాదర్‌బీ 2016 సంవత్సరంలో యనమలకుదురుకు చెందిన అబ్దుల్‌కరీముల్లాను కట్నకానుకలు ఇచ్చి పెద్దల సమక్షంలో వివాహం చేసుకుంది. ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కావడంతో హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తూ అక్కడే కాపురం పెట్టారు. వీరికి 2019లో ఆలీనాజోయ పాప పుట్టింది. పాప పుట్టిందని భర్త అసంతృప్తిగా ఉండేవాడు. దీనికి తోడు అత్తమామలు కూడా పాపను చూసేందుకు రాలేదు. కాగా అదనపుకట్నం తీసుకురమ్మని భర్త కరీ ముల్లాతో పాటు అత్త ఖుర్షీద్ బీబీ, మామ ము న్నీర్, అడపడుచు ఆయేషాబేగం వేధిస్తూ ఈ నెల 7వ తేదీన పుట్టింటికి పంపించేశారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదనపుకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళపై దాడి చేసిన వ్యక్తులపై కేసు

పెనమలూరు: కానూరులో ఓ మహిళపై దాడి చేసిన పలువురు వ్యక్తుల పై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు కథనం మేరకు కానూరు సనత్‌నగర్‌లో షేక్ పర్వీన్ భర్త, పిల్లలతో ఉంటోంది. ఆమె ఉంటున్న ఇంటికి కొద్ది దూరంలో ఆమె తల్లిదండ్రులు ఉంటారు. కాగా ఇంటి పక్కన ఉన్న వారు గొడవపడుతున్నారని తల్లి ఫోన్ చేయడంతో పర్వీన్ తల్లి ఇంటి వద్దకు వెళ్లింది. బట్టలు ఆరవేసుకునే తాడు విషయంలో తల్లి ఇంటి పక్కనే ఉంటున్న తాజున్, షాహినా, ఆయాషా, షఫీ, బాషా గొడవపడుతున్నారు. పర్వీన్‌ను ఉద్దేశిస్తూ నీవెందుకు ఇక్కడికి వచ్చావు అని ఆమె పై దాడి చేశారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసును ఆశ్రయించింది. దాడి చేసిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

పెనమలూరు: కానూరు గ్రామ పరిధిలో బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలు కావడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు కామయ్యతోపునకు చెందిన సతీష్ ఎలక్ట్రీషియన్ పనులు చేస్తాడు. అతను శనివారం బైక్ పై ఇంటికి వెళుతున్న సమయంలో విజయవాడ వైపు నుంచి వచ్చిన బస్సు అతడ్ని వెనుక నుంచి ఢీ కొట్టింది. గాయపడిన సతీష్‌ను స్థానికులు కానూరులో ఆస్పత్రిలో చేర్పించారు. బాధితుడి సోదరుడు సాయికౌషిక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మరో వ్యక్తికి..

పెనమలూరు: కానూరు కామయ్యతోపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలు కావడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం షేక్ సుభానీ తాడిగడప వసంతనగర్ కాలువ కట్టపై ఉంటాడు. అతను టైర్లు పంక్చర్ రిపేర్ చేసే షాపు నిర్వహిస్తాడు. అతను టీ తాగేందుకు సైకిల్ పై తాడిగడప నుంచి కామయ్యతోపు వైపుకు సైకిల్ పై వస్తుండగా బైక్ అతనిని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతడికి గాయాలయ్యాయి. బైక్‌తో ఢీ కొట్టిన వ్యక్తి గుట్టుచప్పుడవ్వకుండా వెళ్లిపోయాడు. బైక్ నంబర్ తెలియలేదు. గాయపడిన బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యే వంశీ సొంత నిధులతో మోటార్ల ఏర్పాటు



రామన్నగూడెంలో ఎమ్మెల్యే వంశీ ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్ల ద్వారా సాగునీరు సరఫరా చేపట్టిన రైతులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని పలుగ్రామాల్లో వరి పంటకు కృష్ణా-ఏలూరు కాలువ నుంచి సాగునీరు అందకపోవడంతో గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ సొంత ఖర్చులతో ప్రత్యేక విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేశారు. మండలంలోని కాకులపాడు, కానుమోలు, రామన్నగూడెం, బొమ్ములూరు, కె.సీతారామపురం గ్రామాల్లో పొట్ట, ఈత దశలో ఉన్న వరి పంటకు సరిగ్గా సాగునీరు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఎమ్మెల్యే వంశీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన ఏలూరు కాలువ నుంచి నీటిని తరలించేందుకు సొంత నిధులతో తాత్కలిక విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయించారు. అదేవిధంగా ప్రత్యేకంగా విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేశారు. దీంతో ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే వంశీకి కృతజ్ఞతలు తెలిపారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

ఉంగుటూరు: మండలంలోని తరిగొప్పల గ్రామంలో ఇద్దరు విద్యార్థుల చదువు నిమిత్తం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ రూ.40 వేలు సాయం చేశారు. ఇటీవల కోవిడ్ సమయంలో తండ్రిని కోల్పోయి గంపా పావని, పూజిత డిగ్రీ మూడవ సంవత్సరం చదువుకునేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యే వంశీ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఆయన తన సొంత నిధులు రూ.40వేలు మంజూరు చేశారు. గ్రామ నాయకులు ఆదివారం ఆ విద్యార్థుల ఇంటికి వెళ్లి నగదును అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కన్వీనర్ కోటగిరి వెంకట రామ్మోహన్‌రావు, ఎంపీటీసీ సభ్యుడు నటరాజన్, యాంద్రపు సూర్యనారాయణ, బాపూజి, చిన్న వీరయ్య, దాదాసాహేబ్, నాగరాజు, సుభాషిణి, గురుప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇరిగేషన్ సిబ్బంది అత్యుత్సాహం.. రైతుల ఆగ్రహం



కాకులపాడు చానల్‌కు సాగునీరు నిలిపిన సిబ్బంది తీరుపై నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నేతలు



ఇరిగేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం పెరికీడు వద్ద కృష్ణా-ఏలూరు కాలువ నుంచి కాకులపాడు చానల్‌కు సాగునీటిని విడుదల చేసే అంశంపై ఆదివారం రాత్రి ఉద్రిక్తత చోటుచేసుకుంది. కింది స్థాయి ఇరిగేషన్ సిబ్బంది అత్యుత్సాహం ప్రదర్శించి విద్యుత్ మోటార్ల ఫీజులు తొలగించడంతో రైతులు ఆగ్రహానికి గురయ్యారు. ఇరిగేషన్ శాఖకు చెందిన సిబ్బంది అక్రమ్ బాధ్యతారహితంగా నోటి దురుసు ప్రదర్శించడం, కొందరు రైతులపై దాడికి యత్నించడం తీవ్ర వివాదానికి దారితీసింది. వివరాల్లోకి వెళితే.. రెండు వారాలుగా కాకులపాడు చానల్‌కు సరిపడగా నీటి మట్టంలో నీరు విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల రైతులు ఇటీవల గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సొంత ఖర్చుతో కృష్ణా-ఏలూరు కాలువకు పెరికీడు వద్ద ప్రత్యేకంగా విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి కాకులపాడు చానల్‌కు నీటి తరలింపు చేపట్టారు. ఆదివారం సాయంత్రం ఈ విద్యుత్ మోటార్లు ప్రారంభించిన కొద్దిసేపటికే అక్కడి వచ్చిన ఇరిగేషన్ శాఖ గుమస్తా అక్రమ్, కలాసీ స్వామియేలు, సిబ్బంది రవికుమార్ రైతులతో వాగ్వాదానికి దిగారు. విద్యుత్ మోటార్ల ఫీజులను తొలగించి నీటి సరఫరాను నిలిపివేశారు. కాకులపాడు చానల్ కింద దాదాపు 10 వేల ఎకరాల్లో వరి సాగులో ఉందని, ఈతదశలో ఉన్న పంటకు సాగునీరు అందకపోతే ఎండిపోతుందని రైతులు ఇరిగేషన్ సిబ్బందికి చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించేందుకే స్వయంగా గన్నవరం ఎమ్మెల్యే వంశీ సొంత నిధులతో ప్రత్యేకంగా ఈ విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి సాగునీరు సరఫరా చేస్తున్నారని రైతులు వివరించారు. రైతులు, ఇరిగేషన్ సిబ్బంది మధ్య వివాదం తెలుసుకున్న ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, కాకులపాడు సర్పంచ్ కాజా ప్రసాద్ హుటాహుటిన ఏలూరు కాలువ వద్దకు చేరుకున్నారు. సాగునీటి సమస్యపై ఇరిగేషన్ సిబ్బందికి నచ్చజెప్పేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు ప్రయత్నించారు. సమస్య మరింత ముదరడంతో హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్, ఏఎస్ఐ రామచంద్రరావు నేతృత్వంలో పోలీస్ సిబ్బంది ఘటనాస్థలికి చేరకుని పరిస్థితిని చక్కదిద్దేందుకు యత్నించారు. ఏలూరు కాలువ డీఈ కొడాలి బాబుకు కాకులపాడు చానల్ వద్ద పరిస్థితిని వైఎస్సార్ సీపీ నాయకులు, పోలీసులు ఫోన్ ద్వారా వివరించారు. దీంతో ఆయన ఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. కాకులపాడు చానల్‌కు సరిపడా నీటి మట్టంలో నీటిని విడుదల చేస్తామని డీఈ కొడాలి బాబు హామీ ఇవ్వడంతో రైతుల ఆందోళన సర్దుమణిగింది. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ సభ్యుడు అరిగెల రాజా, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడకల వీర్రాజు, దంటగుంట్ల మాజీ సర్పంచ్ కురుమిని శ్రీనివాసరావు, పెరికీడు మాజీ ఉప సర్పంచ్ పండు నాగార్జున, రైతు నాయకులు కొండపల్లి హరిబాబు పాల్గొన్నారు.

వంతుల వారీగా నీరు విడుదల చేస్తున్నాం

కృష్ణా-ఏలూరు కాలువకు విజయవాడ నుంచి ఏలూరు వరకు ఉన్న సాగునీటి చానల్స్ అన్నింటికీ వంతుల వారీ పద్ధతిలో నీరు విడుదల చేస్తున్నాం. ఈ నేపథ్యంలో కాకులపాడు చానల్ వద్ద సాగునీటి ఎద్దడి తలెత్తిన మాట వాస్తవమే. రైతులు ప్రత్యేక విద్యుత్ మోటార్లు పెట్టి నీళ్ల తరలించడంతో కింది స్థాయి సిబ్బంది తమ విధి నిర్వహణలో భాగంగా ఫీజులు తొలగించారు. దీంతో రైతులు తమ పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆందోళన చేయడంతో తక్షణం చర్యలు చేపట్టాం. కాకులపాడు చానల్‌కు వెంటనే నీటిని విడుదల చేశాం. రైతుల విజ్ఞప్తి మేరకు మరో 10 రోజుల పాటు కాకులపాడు చానల్‌కు సరిపడా నీటి మట్టంలో నీరు సరఫరా చేస్తాం.

– కొడాలి బాబు, ఏలూరు కాలువ డీఈ

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): బయటకు వెళ్లిన తన భర్త తిరిగి రాలేదని ఆదివారం ఇంజిరపు సంతోషి అనే మహిళ నున్న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కండ్రికలో భార్య ఇద్దరు పిల్లలతో ఉంటున్న ఇంజిరపు వెంకటరమణ(30) ప్లంబర్ పని చేస్తుంటాడు. ఇంటి నుంచి బైక్‌పై శనివారం సాయంత్రం వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదని సంతోషి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విస్తృత సేవలు



సదస్సులో పాల్గొన్న డ్వాక్రా సంఘాలు

పెనమలూరు: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విస్తృత సేవలు అందిస్తుందని సెంట్రల్ విజిలెన్స్ డిపార్టుమెంట్ ఏజీఎం సచిన్‌దేవ్ తెలిపారు. మచిలీపట్నం రీజినల్ ఆఫీస్ సహకారంతో పోరంకి శాఖ ఆదివారం పెనమలూరు సెంటర్ కిలారు ఎస్టేట్‌లో డ్వాక్రా మహిళలకు రుణ మేళా, విజిలెన్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సచిన్‌దేవ్ మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా బంగారు రుణాలు, గృహ రుణాలు, విద్యా రుణాలు, పొదుపు సంఘాలకు రుణాలు అందజేస్తున్నామన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 35 గ్రూపులకు రూ.5 కోట్లు రుణాలు మంజూరు చేశారు. కార్యక్రమంలో రీజినల్ హెడ్ కె.వెంకట్రావు, జోనల్ విజిలెన్స్ ఆఫీసర్ ఎస్ఎల్.గోపాలకృష్ణ, రీజినల్ విజిలెన్స్ ఆఫీసర్ కె.వెంకటరాజు, పోరంకి బ్రాంచ్ మేనేజర్ ఎస్.నందకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మారుతున్న జీవనశైలితోనే వ్యాధులు




కానూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

పెనమలూరు: అంతర్జాతీయ స్ట్రోక్ డే సందర్భంగా కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం తాడిగడప సెంటర్ నుంచి కానూరు సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూరాలజిస్టులు డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి కారణంగా రకరకాల వ్యాధులు వస్తున్నాయన్నారు. ఇందులో ముఖ్యంగా బ్రెయిన్, గుండె సంబంధిత వ్యాధులు అధికంగా నమోదు అవుతున్నాయని వివరించారు. గుండె, బ్రెయిన్ స్ట్రోక్‌ల వలన ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని తెలిపారు. పని ఒత్తిడి, ఆహారపు అలవాట్లు ప్రధాన కారణంగా ఉందని అన్నారు. స్ట్రోక్ వచ్చిన సమయంలో వెంటనే వైద్య సేవలు అందితే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని తెలిపారు. వచ్చే వారం రోజుల పాటు కామినేనిలో ఉచిత న్యూరాలజీ హెల్త్ చెకప్ చేస్తామని పేర్కొన్నారు.

వైభవంగా అమ్మ వారి ఊరేగింపు







మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విశాలాంధ్ర రోడ్డు చలసాని చౌక్‌లో దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారి విగ్రహాలను ఆదివారం మొగల్రాజపురం పరిసర ప్రాంతాల్లో ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. భారీ సెట్టింగ్‌లు, డప్పు వాయిద్యాలు, కోలాటాలతో విశాలాంధ్ర రోడ్డు మొత్తం అమ్మ వారి నామస్మరణతో మారుమోగింది. అమ్మ వారి విగ్రహాలతో పాటు శివుడు, వెంకటేశ్వరస్వామి, వినాయకుడు విగ్రహాలను ఊరేగించారు. హంస వాహనంపై వస్తున్నట్లుగా ఉన్న దుర్గాదేవి సెట్టింగ్ ఆకట్టుకుంది. అధిక సంఖ్యలో భక్తులు ఊరేగింపులో పాల్గొని అమ్మవారి విగ్రహాలను వీక్షించారు. ఉత్సవాల నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.



పారదర్శకంగా ఈ-క్రాప్ జాబితా



మద్దూరులో లబ్ధిదారుల జాబితాను ప్రదర్శిస్తున్న ఏఓ పీఎం కిరణ్, ప్రజాప్రతినిధులు

కంకిపాడు: ఈ-క్రాప్ లబ్ధిదారుల జాబితాను పారదర్శకంగా రూపొందించామని ఏఓ పీఎం కిరణ్ తెలిపారు. మండలంలోని మద్దూరు గ్రామంలో ఈ క్రాప్ లబ్ధిదారుల జాబితా సామాజిక తనిఖీ ఆదివారం నిర్వహించారు. లబ్ధిదారుల జాబితాను సచివాలయంలో ప్రదర్శించారు. ఏఓ మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు సమర్థవంతంగా నిర్వహించామన్నారు. పంట అమ్మకాలు, ప్రకృతి విపత్తుల సమయంలో ఈ-క్రాప్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిప్పల రామదాసు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడకల్చరల్: ప్రవంతి కృష్ణా ఆర్కెస్ట్రా అండ్ ఈవెంట్స్, తెలుగు కళావాహిని, ఇంద్రకీలాద్రి కల్చరల్ ఆర్ట్స్ అధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికపై ఆదివారం నిర్వహించిన తెలుగు హిందీ చిత్రగీతాల కార్యక్రమం ఆకట్టుకుంది. గాయకుడు ప్రవంతి కృష్ణ ఆధ్వర్యంలో విష్ణు ప్రియ సుశీల్‌కుమార్, భారతి, దుర్గానాగమణి, పి.శ్రీనివాసరావు, కోటా శ్రీనివాసరావులు తెలుగు, హిందీ చిత్రగీతాలను మధురంగా ఆలపించారు. గాయకుడు ప్రవంతి కృష్ణ మాట్లాడుతూ నూతన గాయనీ గాయకులకు వేదికను కల్పించాల్సిన అవసముందన్నారు. సంస్థ ద్వారా పేద కళాకారులకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చింతకాయల చిట్టిబాబు, ప్రోగామ్ కన్వీనర్ కేఎస్ఎన్ మూర్తి, పరచూరి విజయలక్ష్మి పాల్గొన్నారు. గాయకుడు సుశీల్‌కుమార్‌ను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మీమీ కుటుంబ సభ్యులు, పిల్లలతో ఆనందోత్సాహాలతో పండుగలు చేసుకోండి... ఘర్షణలకు దిగినా, శాంతి భద్రతలకు ఏ మాత్రం విఘాతం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటానని కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు హెచ్చరించారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, క్రైమ్ సస్పెక్ట్ షీటర్లకు స్టేషన్ ఆవరణలో ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతి వారం తప్పకుండా స్టేషన్‌కు వచ్చి అధికారులకు కనిపించాలని, ఆదివారం స్టేషన్‌కు వస్తున్నాము... ఏం చేసినా చెల్లుతుందని భావించవద్దన్నారు. ప్రతి ఒక్కరిపై నిఘా ఉంటుందని, ఏ మాత్రం గొడవలకు దిగినా వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు నగర బహిష్కరణ విధిస్తామని చెప్పారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను పేరు పేరున పిలిచి గత వారం రోజులుగా వారి దిన చర్య గురించి అడిగి తెలుసుకున్నారు. కొంత మంది అనుమానాస్పదంగా, పొంతన లేని సమాధానం చెప్పడంతో వారికి హెచ్చరికలు జారీ చేశారు. కార్యక్రమంలో స్టేషన్ పరిధిలోని ఆయా సెక్టార్ల ఎస్ఐలు, ఏఎస్ఐలతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ ఆక్యుపంక్చర్ డే ఉత్సవాలు

పెనమలూరు: ప్రపంచ ఆక్యుపంక్చర్ డే ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ఆక్యుపంక్చర్ సైన్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆఫ్ భారత్ (ఉస్పా భారత్) జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు. ఆయన ఆదివారం కానూరు అశోక్‌నగర్‌లో వివరాలు తెలుపుతూ నవంబర్ ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆక్యుపంక్చర్ సైన్స్ ఏ విధంగా ఉపయోగపడుతుందో ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవగాహన సదస్సులు, వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ఉత్తమ సేవలు అందించిన వారికి అవార్డులు అందజేస్తారని పేర్కొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



గేట్ మీటింగ్‌లో పాల్గొన్నా నాయకులు

గన్నవరం: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి వద్ద ఆటోనగర్ డిపో డ్రైవర్ బి.రామ్‌సింగ్‌పై దాడికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఆదివారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డెప్యూటీ జనరల్ సెక్రటరీ ఎండీ. ప్రసాద్ మాట్లాడుతూ డ్రైవర్ రామ్‌సింగ్‌ను దాడిచేయడం దుర్మార్గమన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు డీవీవీ. నారాయణ, టీవీకె. రావు, ఎస్ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు బీ. నాగిరెడ్డి, వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డిపో కార్యదర్శి బీ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి టైలరింగ్ శిక్షణ కొత్త బ్యాచ్ ప్రారంభం

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో నవంబర్ 6వ తేదీ నుంచి టైలరింగ్ శిక్షణ కొత్త బ్యాచ్ ప్రారంభిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం మహిళా విభాగం ఇన్‌చార్జి పి.విజయ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికి టైలరింగ్‌లో 9 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు అందజేశామన్నారు. నవంబర్ 6 నుంచి ప్రారంభమయ్యే శిక్షణలో ఆసక్తి గలవారు 5వ తేదీలోగా గవర్నర్‌పేటలోని ఎం.బి. విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 0866 – 2578044, 94900 98021 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, పుట్టినరోజు, షష్ఠిపూర్తి వివాహ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, ఇతరులకు ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలచిన వారు సంప్రదించండి.

పెనమలూరు డివిజన్

90105 77706 (ఉయ్యూరు)

99122 20539 (పెనమలూరు)

90102 10382 (గన్నవరం)

Office mail : sakshiads@gmail.com

यूनियन बैंक / యూనియన్ బ్యాంక్

ఈడుపుగల్లు బ్రాంచి : శ్రీరామ సాయి హోటల్ ఎదురు, బందర్ రోడ్డు, [illegible] సెంటర్ దగ్గర, ఈడుపుగల్లు గ్రామం, కంకిపాడు (మం), కృష్ణా జిల్లా, ఏపీ - 521151.

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఈడుపుగల్లు బ్రాంచి [illegible] ... **"ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది"** ... [illegible] తేది 06-04-2021 ప్రకారం మొత్తము రూ. 21,57,202.98/- ... [illegible] ... ద్వారా ది. 16-11-2023న ... [illegible]

ఋణగ్రహీతల వివరములు : 1) ఆరేపల్లి వీర వెంకటరావు, తండ్రి : ఆరేపల్లి భాస్కరరావు, ఫ్లాట్ నెం. 201, శ్రీ నిలయం-2, దుర్గా ఎస్టేట్, ఉయ్యూరు-521165, కృష్ణా జిల్లా, ఏపీ. 2) శ్రీమతి ఆరేపల్లి భాగ్యలక్ష్మి, భర్త : ఆరేపల్లి వీర వెంకటరావు, ఫ్లాట్ నెం. 201, శ్రీ నిలయం-2, దుర్గా ఎస్టేట్, ఉయ్యూరు-521165, కృష్ణా జిల్లా, ఏపీ.

ఆస్తి వివరములు :

ప్రాపర్టీ-ఏ షెడ్యూలు : (డాక్యుమెంట్ ప్రకారం) కృష్ణా జిల్లా, ఉయ్యూరు గ్రామం, ఆర్.ఎస్.నెం. ... 3291.44 చ॥గజాల ... [illegible] ... 1037.32 చ॥గజాల స్థలము మరియు

ప్రాపర్టీ-బి షెడ్యూలు : (డాక్యుమెంట్ ప్రకారం) కృష్ణా జిల్లా, ఉయ్యూరు గ్రామం, ఆర్.ఎస్.నెం. ... 3291.44 చ॥గజాల లోని 1037.32 చ॥గజాల ... [illegible] ... 25 చ॥గజాల స్థలము మరియు

ప్రాపర్టీ-సి షెడ్యూలు : (డాక్యుమెంట్ ప్రకారం) కృష్ణా జిల్లా, ఉయ్యూరు గ్రామం, ... 1037.32 ... 25 చ॥గజాల ... 700 చ॥అ॥ ... 170 ... 30 ... ఫ్లాట్ నెం. 606 ... [illegible]

రిజర్వుధర (రూ.): 18,40,000/- ధరావత్తు ధర (రూ.): రూ. 1,84,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం https://www.ibapi.in మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్ : www.unionbankofindia.co.in నందు చూడగలరు. ... [illegible] ... మొబైల్ నెం. 8008561667, బ్రాంచి Mail ID : ubin0827461@unionbankofindia.bank ద్వారా సంప్రదించవచ్చు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/ రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకపు నోటీసు

[illegible]

తేది : 21-10-2023
ప్రదేశం : ఈడుపుగల్లు

సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా